క్లుప్తంగా

కాంగ్రెస్ మండల మహిళా ప్రధాన కార్యదర్శిగా జ్యోతి



మహిళా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జ్యోతి

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ మండల మహిళా ప్రధాన కార్యదర్శిగా బుర్క జ్యోతిని నియమించినట్లు మండల అధ్యక్షురాలు ఆకుల లత తెలిపారు. మండల ఉపాధ్యక్షురాలిగా ఎల్లారెడ్డిపేటకు చెందిన గన్న శోభారెడ్డిని నియమించినట్లు చెప్పారు. జ్యోతి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఆకుల లతకు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న లక్ష్మణ్

వీర్నపల్లి: మండల కేంద్రంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. నాలుగు నెలల నుంచి పిల్లలకు వంట చేసిన పైసలు రాలేదు.. కోడిగుడ్ల డబ్బులు రాలేదు.. జీతాలు రాలేదు.. ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు, జీతాలు, కోడిగుడ్ల పైసలు చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. చాకలి భాగ్య, శంకరయ్య, మల్లారం గౌరి తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

కోనరావుపేట: ధర్మారంలోని ఎస్సీ హాస్టల్‌లో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. హాస్టల్‌లోని విద్యార్థుల పదోతరగతి పరీక్షలు ముగిసిన సందర్భంగా ఆటాపాట కార్యక్రమాలు నిర్వహించారు. వార్డెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


కేసీఆర్‌నగర్‌లో కమ్యూనిటీ హెల్త్ క్యాంప్



గ్రామస్తులను పరీక్షించి మందులిస్తున్న వైద్యులు

తంగళ్లపల్లి: కేసీఆర్‌నగర్(డబుల్ బెడ్‌రూం సముదాయం)లో ఆదివారం ఉదయం పద్మశాలీ అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్స్(పోపా) ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. సరయు హాస్పిటల్ నుంచి డాక్టర్ తడుక సాయికుమార్, డాక్టర్ తాటిపాముల రవళి, డాక్టర్ గాదర్ల దీప్తి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలువాల ఈశ్వర్, వాసాల హరిప్రసాద్, బొల్లి భగవాన్, కోడం రాంప్రసాద్, దాసిరి తిరుమల, గాదర్ల మోహన్, గాజుల ప్రతాప్, దూస రఘుపతి, నాగుల శ్రీనివాస్, గడీల రమేశ్, కారంపూడి రాజేశం, పరమేశ్వర్, కాశీరాం, చక్రపాణి, మధు, సత్యం, రవీందర్ పాల్గొన్నారు.

ఆత్మీయతకు ప్రతీక ఇఫ్తార్



రుద్రంగి(వేములవాడ): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో ఉండే ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రుద్రంగి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నాయకులతో కలిసి పాల్గొన్నారు. డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, గండి నారాయణ, మహేశ్ తదితరులున్నారు.

గ్రామ సింహాలతో బెంబేలు



కోనరావుపేట: కనగర్తిలో కొన్ని రోజులుగా శునకాలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంపులుగుంపులుగా ఉంటూ రహదారి వెంట వెళ్లే చిన్నారులు, వాహనదారులపై దాడికి యత్నిస్తున్నాయి. దీంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని నెలలుగా గ్రామంలో పలువురిపై దాడి చేసిన సందర్భాలున్నాయి. గ్రామంలో కుక్కల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు నెల్లుట్ల జనార్దన్. వరద కాలువ కింద విలాసాగర్ గ్రామంలో సుమారు 25 ఎకరాలు వరి సాగు చేశాడు. భారీ ఖర్చుతో వరద కాలువ నుంచి వరి చేలోకి రెండు కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసుకున్నాడు. ఇపుడు వరద కాలువలో నీరు అడుగంటింది. మరో పది రోజులు వరి పంటకు నీరు అందకుంటే పంట ఎండిపోతుంది. ఏం చేయాలని ఆవేదన చెందుతున్నాడు.



విలాసాగర్-గర్శకుర్తి మధ్య ఉన్న బ్రిడ్జి దగ్గర ఎండిన వరద కాలువ వద్ద ఉన్న రైతు గంగాధర నర్సయ్య. కాలువ నీరు ఆధారంగా పది ఎకరాల మేర వరి పంట వేశాడు. ఇపుడు వరద కాలువలో నీరు లేక పంటకు ఎలా నీరు అందించాలో తోచక దిగాలుగా ఉన్నాడు. వరద కాలువకు నీరు రాకపోతే తినే అన్నంల మన్నుపడ్డట్లేనని అంటున్నాడు. వరద కాలువ కింద మూడు మండలాలకు చెందిన పది గ్రామాల్లో సుమారు వేయి ఎకరాలు వరి సాగు చేసిన రైతుల ఆవేదన ఇది.

వరద కాలువ వెలవెల..



విలాసాగర్-గర్శకుర్తి మధ్య నీరు లేని వరద కాలువ



నీరు లేక ఎండుతున్న పొలం చూపిస్తున్న రైతు

- ఆందోళనలో అన్నదాతలు

బోయినపల్లి: ఆరేళ్ల అనంతరం వరద కాలువ నీరు లేక అడుగంటింది. యాసంగి సీజన్‌లో వరి పంటలు వేసిన రైతులు సాగునీరు లేక అరిగోస పడుతున్నారు. కాలువ కింద కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి, రామడుగు, గంగాధర మండలాల్లోని పది గ్రామాల రైతులు సుమారు వేయి ఎకరాలకు పైగా వరి పంట సాగు చేశారు. చివరికి వరద కాలువలో నీరు లేక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. పంటలు కాపాడుకునేందుకు రైతులు ఆరేళ్ల క్రితం తవ్విన గుంతల్లో పూడిక తీసి పైపులైన్ల ద్వారా పంటలకు నీరందించే ప్రయత్నం చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో గుంతల్లో సైతం నీరు ఇంకిపోయే ప్రమాదం ఉండడంతో నీటి విడుదల కోసం ఎదిరి చూస్తున్నారు. కాలువకు ఎల్లంపల్లి లేదా ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదల చేయాలని రైతులు ఆందోళన బాట పట్టారు. నీరు విడుదల చేసి పంటలు కాపాడాలని గంగాధర మండలం కురిక్యాల ప్రాంతంలో వరద కాలువ వద్ద పలు గ్రామాల రైతులు రెండు రోజుల క్రితం ధర్నా చేపట్టారు.

గతేడాది కాళేశ్వరం జలాలు..

గతేడాది జనవరి 2023 నుంచి మార్చి 2023 వరకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి, రామడగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరద కాలువకు భారీగా నీరు విడుదల చేశారు. మండు వేసవిలో అపుడు వరద కాలువలో నిండుగా నీరుండేది. దీంతో పంటలు బాగా పండాయి. ఇదే ఆలోచనతో ఈసారి వరద కాలువ ఆధారంగా వేయి ఎకరాల మేర సాగు చేశారు. పొలాలు ఎండిపోతున్నాయి. ఎల్లంపల్లి లేదా ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.

గుడిమెట్ల నిర్మాణానికి శంకుస్థాపన



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న అమృత

ఎల్లారెడ్డిపేట: కోరుట్లపేట-సింగారం గ్రామాల మధ్య గల శ్రీదొంతురాల మల్లికార్జునస్వామి ఆలయం వద్ద మల్లన్న గుడి వద్దకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించతలపెట్టిన మెట్ల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. మెట్ల నిర్మాణానికి నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం పడ్కల్ గ్రామానికి చెందిన తోడుపునూరి వెంకటేశం-రుక్మిణి, శ్రీనివాస్-సంధ్య, సామ్రాట్-నమ్రత నిధులను వితరణ చేశారు. మొత్తం ఖర్చు ఈ దంపతులు భరిస్తున్నారు. నిర్మాణ పనులకు వారి తల్లి తోడుపునూరి అమృత శంకుస్థాపన చేశారు. మెట్ల నిర్మాణానికి ముందుకొచ్చిన దంపతులకు యాదవ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం సభ్యులు ఒగ్గు బాల్‌రాజు, ఒగ్గు మహేశ్, మానుక నాగరాజు, బొల్లు భూమయ్య, నాగ మల్లేష, ఆది మల్లయ్య, శేఖర్, లింగం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

బోయినపల్లి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రారంభిస్తారని మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఆదివారం తెలిపారు.

సేవలు గుర్తుండిపోతాయి



రామయ్యశర్మ, రాజేశ్వరిని సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

వేములవాడ: రాజన్న ఆలయంలో విధులు నిర్వహించిన ఇద్దరు ఉద్యోగులు హార్మోనిస్టు కొంటికర్ల రామయ్యశర్మ, స్వీపర్ రాజేశ్వరి ఆదివారం ఉద్యోగ విరమణ పొందగా.. ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉద్యోగులు అందించిన సేవలు గుర్తుండిపోతాయని కితాబిచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ ఉద్యోగుల సమక్షంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేశారు. ఆలయ ఏఈవో ప్రతాప నవీన్, ఈఈ రాజేశ్, అధికారులు, సిబ్బంది సత్కరించారు.

పేదలకు అన్నదానం



వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం 150 మందికి అన్నదానం చేశారు. 1,069 రోజులుగా నిత్యం పేదలకు అన్నదానం చేస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, నటరాజ్, సంతోష్, రాజేందర్, రవి, రాహుల్, ప్రసాద్ తెలిపారు.

రేపు భవన నిర్మాణ కార్మికుల సమావేశం

బోయినపల్లి(చొప్పదండి): సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈనెల 2న జరిగే భవన నిర్మాణ కార్మికుల జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం రాజు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొనాలని కోరారు. బాబు, రాజలింగం, శ్రీను, నర్సయ్య తదితరులున్నారు.

దిక్కులేనిదాన్ని.. న్యాయం చేయండి సారూ..

- ఠాణా చుట్టు తిరుగుతున్న మహిళ



న్యాయం చేయాలని వేడుకుంటున్న లక్ష్మి

చందుర్తి(వేములవాడ): తనకు ఎవరూ దిక్కులేరని.. తన మరిదితో ప్రాణభయం ఉందని.. న్యాయం చేయాలని కోరుతూ ఓ బాధిత మహిళా ఠాణా మెట్లెక్కింది. బాధిత మహిళ తెలిపిన వివరాలు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలో గ్రామపంచాయతీ సిబ్బంది నల్లాపైపులను మరమ్మతు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కట్కూరి లక్ష్మి చెందిన తాగునీటి పైపు ఊడిపోయింది. దీంతో అక్కడే పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు ఎడ్ల రాజేందర్, తుప్పతి పర్శరాములు, కట్కూరి భూమయ్యలను తమకు నల్లా నీరు రావడం లేదని నిలదీసింది. తమ పైపుకు మరమ్మతు చేసే వరకు గుంత పూడ్చవద్దని కోరగా.. పంచాయతీ కార్మికుడు, లక్ష్మి మరిది కట్కూరి భూమయ్య ఆవేశంతో అక్కడే ఉన్న కొబ్బరిమట్టతో వీపుపై దాడి చేశాడు. దీంతో బాధిత మహిళ ఈనెల 24న చందుర్తి ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు స్పందించకపోవడంతో ఈనెల 27న తన చిన్నాన్న నేదూరి దేవయ్య, అక్క మల్యాల వజ్రను తీసుకొని మళ్లీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సరిగ్గా స్పందించకపోగా.. సదరు మహిళపైనే ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో చేసేదేమి లేక ఇంటిదారి పట్టింది. ఆదివారం విలేకరులను ఆశ్రయించింది. తనకు మరిదితో ప్రాణాపాయం ఉందని, గతంలోనే దాడి చేస్తే కేసు పెట్టినట్లు తెలిపింది. తరచూ గొడవలకు దిగుతున్నాడని, న్యాయం చేయాలని వేడుకుంటుంది. ఈ విషయమై ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. కేసు విచారణలో ఉందని తెలిపారు.

‘రాష్ట్రాన్ని దోచుకునేందుకే మీ ఆరాటం’



కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్న బొప్పాపూర్ మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, నాయకులు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్రాన్ని దోచుకునేందుకే మీ ఆరాటమని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఉద్దేశించి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రాచర్ల బొప్పాపూర్ మాజీ సర్పంచ్ కొండాపూర్ బాల్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు నంది కిషన్, దుమాల మాజీ ఎంపీటీసీ కదిరె బాలకిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో వందకు పైగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మహేందర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, పట్టణాధ్యక్షుడు చెన్ని బాబు, పార్టీ నాయకులు షేక్ గౌస్, లింగంగౌడ్, రాజేందర్, రాజునాయక్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

చెల్లె లిక్కర్ అమ్మితే.. అన్న ఇసుక అమ్మిండు

తంగళ్లపల్లి: చెల్లెలు ఢిల్లీలో లిక్కర్ అమ్మితే.. అన్న సిరిసిల్లలో ఇసుక అమ్ముకున్నడని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం స్థానిక ఇంపీరియల్ గార్డెన్‌లో మండలస్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. లిక్కర్ స్కాంలో కవిత జైలుకు వెళ్లినట్లు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని, కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు కాసుల వర్షం కురిపించిందన్నారు. కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో ముస్లిం మైనారిటీ నాయకులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కొన్ని కుల సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జెడ్పీటీసీ పూర్మాని మంజుల, మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నేరెళ్ల నర్సింగంగౌడ్, లింగాల భూపతి, కాముని వనిత, పూర్మాని రాంలింగారెడ్డి, గోనె ఎల్లప్ప, మోర రాజు, ఎంపీటీసీ బైరినేని రాము, మునిగెల రాజు, చుక్క రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేకే ఔదార్యం

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి క్షతగాత్రుల పట్ల ఔదార్యం చూపారు. ఆదివారం సాయంత్రం సిరిసిల్ల శివారులోని సర్దాపూర్ పోలీస్ బెటాలియన్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. అదే సమయంలో కేకే మహేందర్‌రెడ్డి అటువైపుగా వచ్చారు. కారు ఆపి క్షతగాత్రుల అవస్థను చూసి అంబులెన్స్‌కు సమాచారమందించారు. బాధితులను జిల్లా సుపత్రికి సత్వరమే తీసుకెళ్లేలా చొరవ చూపారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

కోనరావుపేట: సింగిల్‌విండో పరిధిలోని రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామని కొలనూర్ సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రాంమోహన్‌రావు అన్నారు. కొలనూర్ సింగిల్‌విండో మహాసభ ఆదివారం నిర్వహించి ఆదాయ, వ్యయ నివేదికలను ప్రవేశపెట్టారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడంతోపాటు రాయితీపై ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్, డైరెక్టర్లు గరుగుల నాగిరెడ్డి, జవ్వాజి దేవయ్య, ఉత్తెం అంజయ్య, సత్యనారాయణరావు, చాట్ల రాములు, ఇప్ప రాములు, జలగం సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసమ్మతి నేతల సమావేశం



బోయినపల్లిలో కాంగ్రెస్ నాయకుల సమావేశం

బోయినపల్లి: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బోయినపల్లి మండల కేంద్రంలో అధ్యక్షుడి తీరుపై కాంగ్రెస్ అసమ్మతి నాయకులు ఆదివారం నిర్వహించిన సమావేశం మండలంలో చర్చకు దారి తీసింది. సమావేశంలో కొంతకాలంగా ఉన్న అసంతృప్తిని పలువురు నాయకులు వెళ్లగక్కినట్లు సమాచారం. ఇటీవల మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన మంచినీటి పథకం పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిధులు మంజూరు చేసినట్లు తెలిసింది. కాగా పనులను ఒకరిద్దరు నాయకులే చేసుకుంటామని అనడంతో.. విభేదాలు వచ్చినట్లు సమాచారం. పనులు మంజూరైన గ్రామాల్లోని కాంగ్రెస్ నాయకులు పని చేసుకుంటే వారికి గ్రామంలో పట్టుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని పలువురు నాయకులు అనుకున్నట్లు సమాచారం. మండల అధ్యక్షుడిని మార్చాలని అభిప్రాయపడ్డట్లు తెలిసింది. ఇందుకు సంతకాల సేకరణ చేసినట్లు సమాచారం. సమావేశానికి రెండు రోజుల ముందు పార్టీ వాట్సాప్ గ్రూపుల్లో సమావేశం ఉందని కొందరు, లేదని, రావద్దని మరొకరు చాట్ చేయడం ఆసక్తి రేపింది. సమావేశంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, పలువురు ముఖ్య నాయకులు, పలు గ్రామ శాఖల అధ్యక్షులు పాల్గొన్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



మృతురాలు భారతవ్వ

బోయినపల్లి: పోచమ్మ బోనాలకు వెళ్లి వస్తూ వేములవాడ అర్బన్ మండలం మారుపాకకు చెందిన సందూరి భారతవ్వ(55) అనే మహిళ ఆదివారం సాయంత్రం మృతిచెందింది. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన శ్రీకాంత్, వేములవాడ అర్బన్ మండలానికి చెందిన భారతవ్వ రామడుగు మండలం రంగసాయిపల్లిలో బంధువుల ఇంట్లో జరిగిన పోచమ్మ బోనాలకు హాజరయ్యారు. గంగాధర నుంచి బోయినపల్లి మీదుగా తిరిగి ఇంటికి బయలుదేరారు. బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే దారిలో ఉన్న పెట్రోల్ బంక్ పరిసరాల్లో ఆటోను వెనుక నుంచి బైక్ ఢీకొంది. ప్రమాదంలో భారతవ్వ తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. భారతవ్వను పోలీసులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. మృతిచెందింది. శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. శ్రీకాంత్ అజాగ్రత్తతో వాహనం నడిపి ఆటోను బైక్‌తో ఢీకొట్టడంతో భారతవ్వ మృతిచెందిందని ఆమె బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చందుర్తి(వేములవాడ): ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన నాగరాజు అనే యువకుడు ఆదివారం రాత్రి తీవ్ర గాయాలపాలయ్యాడు. చందుర్తి ఎస్సై కథనం ప్రకారం.. నాగరాజు తన ద్విచక్ర వాహనంపై వేములవాడ పట్టణానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో.. చందుర్తి మండలం మల్యాల గ్రామ శివారులోని కోళ్లఫారం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. చందుర్తి ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ నాగరాజును 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేటి నుంచి శ్రీసీతారామచంద్రస్వామి ప్రతిష్ఠ ఉత్సవాలు



ముస్తాబైన బుగ్గ రామన్న ఆలయం

వీర్నపల్లి: సీతారామచంద్రస్వామి క్షేత్రం(బుగ్గ రామన్న) పునర్నిర్మాణమైంది. రంగంపేట శివారులోని అడవిలో వెలసిన దేవున్ని గ్రామ ప్రజలు భక్తిప్రపత్తులతో అనాదిగా కొలుస్తూ వస్తున్నారు. ఇటీవల గ్రామ ప్రజలంతా కలిసి చందాలు పోగు చేసి ఆలయాన్ని పునర్నిర్మించారు. సోమవారం నుంచి ఉత్సవాలు జరగనున్నాయి. దేవాలయం వెనక భాగంలో నీటి బుంగ ఉంది. ఈ బుగ్గ గుండం నీటిని స్వామివారి అభిషేకానికి వాడుతారు. వీర్నపల్లి మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రంగంపేట గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామివారి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి గురువారం వరకు జరగనున్నాయి. ఏర్పాటు పూర్తి చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



వేములవాడరూరల్: ఎదురుగట్ల గ్రామానికి చెందిన పొన్నం పరశురాంగౌడ్ ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి మృతిచెందగా.. ఆయన కుటుంబానికి సంఘ సభ్యులు రూ.70వేలు ఆర్థిక సాయం అందజేశారు. రాష్ట్ర గౌడ యూనిఫామ్ అసోసియేషన్, రాజన్న సిరిసిల్ల జిల్లా గోపా ఆధ్వర్యంలో నగదు అందించారు. ఆయనకు నలుగురు కుమార్తెలుండగా.. చిన్న కుమార్తె విద్యాభ్యాసం కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర గౌడ యూనిఫామ్ అసోసియేషన్ సభ్యులు, సీఐ రాజమౌళిగౌడ్, రిటైర్డ్ సీఐ బుచ్చిరాములుగౌడ్, నాగన్నగౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్‌గౌడ్, వేములవాడ గోపా పట్టణ అధ్యక్షుడు దూలం సంపత్‌గౌడ్, కార్యదర్శులు విక్కుర్తి లక్ష్మినారాయణగౌడ్, కైరి లింగయ్యగౌడ్, ఎదురుగట్ల గౌడ సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మిత్రుల సాయం

ముస్తాబాద్: మద్దికుంటకు చెందిన బట్టు నగేశ్, దొంకుల స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. 1991–92 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన మిత్ర బృందం అండగా నిలిచింది. నగేశ్, స్వామి కుటుంబాలకు రూ.10వేల నగదును ఆదివారం అందించారు. ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుతున్న మిత్రులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి బంధువులను ఓదారుస్తున్న మనోహర్‌రెడ్డి

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లిలో ఇటీవల మరణించిన మ్యాకల సింగరయ్య కుటుంబాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్, ఉప సర్పంచ్ నల్ల సతీష్‌రెడ్డి, సాయిగౌడ్, మనోహర్, మహేందర్, లక్ష్మణ్, ప్రశాంత్, అంజి, పర్శరాములు ఉన్నారు.

ప్రతీ వాహనం తనిఖీ



వేములవాడ బైపాస్ రోడ్డులో వాహన తనిఖీలు

వేములవాడ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్–1 వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వేములవాడ పట్టణ శివారులోని సాయిరక్ష చౌరస్తా వద్ద ఆదివారం ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, రూ.50 వేల కంటే మించి నగదు ఉంటే సరైన ధ్రువీకరణ పత్రాలుండాలని, లేకుంటే నగదును సీజ్ చేస్తామని చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ సంతు, జూనియర్ అసిస్టెంట్ భిక్షపతి, వీడియోగ్రాఫర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక దృష్టి పెట్టారు. జగిత్యాల జిల్లా నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు వస్తున్న వాహనాలను వేములవాడ రూరల్ పోలీసులు జిల్లా సరిహద్దులోని వట్టెంల, ఫాజుల్‌నగర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేశారు. రూరల్ ఎస్ఐ మారుతి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు.. ప్రతి వాహనాన్ని పరిశీలించి అనుమతిస్తున్నారు.

పంటలపై అవగాహన

వేములవాడరూరల్: ఉద్యోగంలో చేరే ముందు విద్యార్థులకు ఆ శాఖ అధికారులు ప్రత్యేక పంటలపై అవగాహనకు శిక్షణ అందిస్తున్నారు. కళాశాల విద్యార్థులు మర్రిపల్లి గ్రామంలో పంటలపై ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ఆదివారం గ్రామంలోని పలువురు రైతుల పంటలను పరిశీలించారు.